రైల్వే అండర్ బ్రిడ్జి సీపేజ్‌లు అరికట్టాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రైల్వే అండర్ బ్రిడ్జి సీపేజ్‌లను అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మూడు ఆర్‌యుబిల సీపేజ్‌లపై సంబంధిత రైల్వే అధికారులతో సమీక్షించారు. ఆర్‌యుబిల్లో సీపేజ్‌ల వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. వెంటనే రైల్వే అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో సీపేజ్‌లను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌యుబిలు ఎప్పుడూ శుభ్రంగా ఉంచేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రైల్వే ఎడిఎం శంకర్, మున్సిపల్ ఇంజినీర్ పి.త్రినాధరావు, ఆర్అండ్‌బి ఇఇ లోకేశ్వర్, సంబంధిత కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పవన్ వ్యూహం ఏమిటో..!

- భీమవరంలో జనసేనాని ఐదు రోజుల బసపై సర్వత్రా చర్చ
- ఓడిన చోట విజయఢంకా మోగించాలనే యోచనలో జనసేన ఎత్తుగడ
- ముఖ్య నేతలతో సమావేశాలు.. కీలక చర్చలు
- ఎన్నికలు రాకముందే వేడెక్కిన జిల్లా రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యూహం ఏమిటీ.. ఐదు రోజులు ఇక్కడే బస చేయడానికి కారణం ఏమిటీ.. అసలు భీమవరానికి ఎందుకంత ప్రాధాన్యత ఇస్తున్నారు.. ఓడిన చోటే విజయఢంకా మోగించాలనే ఎత్తుగడతో జనసేనాని ముందుక సాగుతున్నారా.. ముఖ్యనేతలతో అంతర్గత సమావేశాల వెనుక ఆంతర్యమేమిటీ.. అసలు భీమవరంలో ఏం జరుగుతుందా అని జనంలో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు రాకముందే జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. జనసేన ప్రధానంగా ఇక్కడే కేంద్రీకరించడంతో ఉభయగోదావరి జిల్లాల చుట్టూ రాష్ట్ర రాజకీయం తిరుగుతోంది.

గత ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో జనసేన బలపడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గోదావరి జిల్లాల్లో జనసేన కొంత ప్రభావం చూపింది. ఈ జిల్లాల్లో కాపు సామాజిక తరగతికి చెందిన వారు ఉండటమే దీనికి కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జనసేనాని పవన్ కూడా పదేపదే ఈసారి అసెంబ్లీలో అడుగు పెడతామని చెబుతుండటం, ఇది సాధ్యం కావాలంటే తన సామాజికతరగతి ఎక్కువ శాతం ఉన్న ఉభయగోదావరి జిల్లాల నుంచే సాధ్యమవుతుందని, ఆ విధంగా జనసేన ప్రణాళిక రచించిందనే చర్చ సర్వత్రా సాగుతోంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన వారాహి విజయయాత్ర చేపట్టింది. ప్రధానంగా ఉభయగోదావరి జిల్లాల్లోని 34 నియోజకవర్గాలపై కేంద్రీకరించిన జనసేన తూర్పుగోదావరి జిల్లా అన్నవరం నుంచి ఈ నెల 14న వారాహి యాత్ర ప్రారంభించిన సంగతి తెలిసిందే. తూర్పుగోదావరి జిల్లాలో పర్యటన పూర్తి చేసుకుని నరసాపురం సభ అనంతరం ఈ నెల 26వ తేదీ రాత్రికి భీమవరం చేరుకున్న పవన్ ఇక్కడే మకాం వేశారు. స్వల్ప అస్వస్థతకు గురైన పవన్ విశ్రాంతి అవసరమని భావించి ఇక్కడే ఉండిపోయారని పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ రాజకీయ కోణం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

పశ్చిమలో పట్టుకు తహతహ

జిల్లాల పునర్విభజన్లో ఏర్పాటైన పశ్చిమగోదావరి జిల్లాలో పట్టు సాధించేందుకు జనసేన తహతహలాడుతోంది. జిల్లా కేంద్రం భీమవరంలో జనసేనానికి మకాం వేయడానికి కారణం ఇదేననే చర్చ పెద్దఎత్తున సాగుతోంది. దీనిలో భాగంగానే ఉమ్మడి పశ్చిమగోదావరి నేతలతో చర్చలు జరిపి భీమవరంలో పవన్ బహిరంగ సభ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. భీమవరంలో పవన్ పర్యటన ఒక్కరోజే ఉంటుందని జనసేన నేతలు ముందుగా చెప్పినప్పటికీ, పవన్ అస్వస్థత, తాజాగా సభ పేరిట ఇక్కడే మకాం వేయడం వెనుక ఆంతర్యం వేరే అనే చర్చలు సాగుతున్నాయి. ప్రధానంగా జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో జనసేనకు బలంగా ఉన్నట్లు ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో భీమవరంలో పోటీ చేసిన పవన్‌కళ్యాణ్ 62,285 ఓట్లుతో రెండో స్థానంలో నిలిచారు. నరసాపురంలో బొమ్మిడి నాయకర్ 49,120 ఓట్లుతో రెండో స్థానంలో నిలవగా, తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి శ్రీనివాస్ 36,970 ఓట్లుతో మూడో స్థానంలో నిలిచారు.

భీమవరానికే ఎందుకంత ప్రాధాన్యత!

గత ఎన్నికల్లో పవన్ భీమవరం, గాజువాక నుంచి పోటీ చేసి పరాజయం పొందినప్పటికీ భీమవరం వైపే దృష్టి కేంద్రీకరించారు. వచ్చే ఎన్నికల్లో భీమవరంలో జనసేన జెండా ఎగురవేయాలని పవన్ కంకణం కట్టుకున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే భీమవరానికి రాష్ట్రంలో ఎక్కడా లేని ప్రాధాన్యత ఇస్తున్నారనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. గత ఎన్నికల్లో భీమవరం నియోజకవర్గం నుంచి వైసిపి, జనసేన, టిడిపి నడుమ త్రిముఖ పోటీ జరిగింది. అప్పటి గణాంకాల ప్రకారం నియోజకవర్గంలో 2,46,342 మంది ఓటర్లుండగా మొత్తం 1,92,061 ఓట్లు పోలయ్యాయి. వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌కు 70,642 ఓట్లు (36.78 శాతం), వామపక్షాల మద్దతుతో బరిలో నిలిచిన జనసేన అభ్యర్థి కొణిదెల పవన్‌కళ్యాణ్‌కు 62,285 ఓట్లు (32.43 శాతం), టిడిపి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులకు 54,037 ఓట్లు (28.14 శాతం) వచ్చాయి. వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ 8,357 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పోయినచోటే వెతుక్కోవాలనే చందంగా జనసేనాని ఈసారి ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ భీమవరంలో పాగా వేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

వేడెక్కిన రాజకీయం..

ఎన్నికలకు ఏడాది ముందే జిల్లాలో రాజకీయం వేడెక్కింది. రానున్న ఎన్నికల్లో బలాబలాలు నిరూపించుకునేందుకు ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే పోటీ పడుతున్నాయి. టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నాయి. వైసిపి గడపగడపకు తిరుగుతూ ప్రజలతో మమేకమవుతుంది. టిడిపి ఇప్పటికే జిల్లాలో రైతు పోరుయాత్ర పేరిట పాదయాత్ర నిర్వహించింది. జనసేన వారాహి యాత్ర పేరుతో జిల్లాలో ముఖ్య నేతలతో సమావేశాలు, బహిరంగ సభలతో క్షణం తీరిక లేకుండా ముందుకు సాగుతోంది. ఇక వామపక్షాలు ప్రధానంగా సిపిఎం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల గొంతుకలా నినదిస్తూనే ఉద్యమాలు సాగిస్తోంది. ఇదిలా ఉంటే జనసేన అధినేత ఇక్కడ ఐదు రోజులు బస చేయడం అందరి చూపు పశ్చిమగోదావరి వైపు, ప్రధానంగా భీమవరంవైపు పడిందని చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో పవన్ కీలక ప్రకటనలు ఏమైనా చేస్తారో లేదో 30న సభ వరకూ వేచిచూడాలి.

జగన్ హయాంలో విద్యావ్యవస్థ మెరుగు

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు హయాంలో దేశంలోనే రాష్ట్ర విద్యా వ్యవస్థ 15 ఉంటే, మూడో స్థానానికి మెరుగుపర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదే అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. నాలుగో విడత అమ్మఒడి పంపిణీ కార్యక్రమం అల్లూరి సీతారామరాజు సాంస్కృతి కేంద్రంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షత వహించగా మంత్రి కారుమూరి మాట్లాడారు. జగన్ రాకతో రాష్ట్ర విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందిందన్నారు. అమ్మఒడితోపాటు, విద్యా కానుక వంటి సంక్షేమ పథకాలే కాకుండా నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చారని తెలిపారు. విద్యార్థులు ఆత్మ స్థయిర్యంతో పాటు, శారీరకంగా కూడా దృఢంగా ఉండాలనే సంకల్పంతో మధ్యాహ్న భోజన పథకం ద్వారా రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలూ కల్పిస్తోందన్నారు. ఎంఎల్‌సిలు వంక రవీంద్రనాథ్, జై మంగళం వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి విద్యార్థీ చదువుకోవాలని ఆకాంక్షతో అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులకు అమ్మ ఒడి చెక్కులు పంపిణీ చేశారు.

పవన్‌పై కారుమూరి ఘాటు వ్యాఖ్యలు

పవన్‌ది వారాహి యాత్ర కాదని.. లారీ యాత్ర అని అమ్మఒడి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. రాష్ట్ర రాజకీయాలపై అవగాహన లేకుండా యాత్ర ఎందుకన్నారు. సినిమాలు చేసే వ్యక్తికి జగన్మోహన్ రెడ్డి విద్యాభివద్ధికి చేపట్టిన నాడు-నేడు, అమ్మఒడి వంటి పథకాలు ఎలా తెలుస్తాయని విమర్శించారు. ఇంగ్లీష్ మీడియంపై విద్యార్థుల్లో ఉన్న అవగాహన కూడా చంద్రబాబుకు, పవన్‌కు లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, ఎంఇఒలు బి.వినాయకరావు, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా బాధుడే బాధుడని రాగాలు తీశారని, ప్రస్తుతం జగన్ మార్కు బాధుడు నడుస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు బ్రాహ్మణచెరువు నుంచి పెనుమంట్ర సబ్ స్టేషన్‌కు వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఇ బాపూజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కరెంటు బిల్లులతో ప్రజలకు షాక్ కొడుతోందన్నారు. ప్రభుత్వాలు సామాన్యులను దోచి కార్పొరేట్ల జేబులు నింపుతున్నాయన్నారు. ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రతిఘటించాలన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు లొంగి విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసి, సంస్కరణ పేరుతో ఛార్జీలు పెంచితే జనం తిరగబడ్డారని, కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేసి పోరాడారని, అప్పట్లో వైఎస్ఆర్ కూడా ప్రతిపక్ష ఎంఎల్‌ఎగా నిరాహార దీక్ష చేశారని గుర్తు చేశారు. తక్షణం విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కె.సుబ్బరాజు, నాయకులు బి.విజయ్ కుమార్, సిహెచ్.లక్ష్మికుమారి, ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించి మన్ననలు పొందాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జెసి

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలో 36వ వార్డు శివరావుపేట, 37వ వార్డు సూర్యనారాయణపురం వార్డు సచివాలయాలను జెసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం ఎంత మంది పనిచేస్తున్నారు, మంగళవారం ఎంత మంది హాజరయ్యారని ఆయన ఆరా తీశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండరు, ప్రజా సమస్యల పరిష్కారం నివేదిక రిజిస్టరు, తదితర వాటిని జెసి పరిశీలించారు. వచ్చే నెలలో ప్రభుత్వం అమలు చేసే పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను సోషల్ ఆడిట్ చేశారా లేదా అన్నది పరిశీలించారు. సంబంధిత అర్హుల జాబితాను ప్రతినెలా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. జగనన్న సురక్ష పథకం ఇంటింటి సర్వే ఎలా జరుగుతోందని ఆరా తీశారు. ప్రజలు ఇచ్చిన ప్రతి ఫిర్యాదునూ స్వీకరించి ఏ రోజు డేటా ఆ రోజు ఆన్‌లైన్ చేయాలన్నారు. సచివాలయంలో ఆలస్యం లేకుండా ప్రజలకు పౌర సేవలు అందాలన్నారు. నోటీస్ బోర్డులు, బయట వివిధ పథకాల ఫ్లెక్సీలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి తగు సూచనలను చేశారు. ఆయన వెంట తహశీల్దార్ వై.రవి కుమార్, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లుల మోత.. ప్రజలకు వాత

సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రతి నెలా భారం

ఈ భారాలు మోయలేమంటున్న జనం

ప్రజాశక్తి - కాళ్ల, ఆచంట

సామాన్య, మధ్యతరగతి, ధనికులు అనే తేడా లేకుండా అధిక విద్యుత్ బిల్లులు వినియోగదారులకు షాక్ ఇస్తున్నాయి. విద్యుత్తు కన్స్యూమర్ ఛార్జీ, ఇంధన సర్దుబాటు ఛార్జీ, ట్రూఅప్ ఛార్జీల పేరుతో మూడు రకాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేల కోట్ల అదనపు భారాలు వేసి వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వాలు వేస్తున్న విద్యుత్ భారాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఈ భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెట్టింపు బిల్లు వచ్చింది.. ★★★

సూదికొండ నాగేశ్వరరావు, సెలూన్ షాప్, జువ్వలపాలెం

గత ఎన్నికల సమయంలో ప్రజలకు విద్యుత్ భారాన్ని తగ్గిస్తానన్న ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు ఏకంగా రెట్టింపు కరెంట్ బిల్లుల భారాన్ని ప్రజలపై మోపడం మోసగించడమే. గతంలో ప్రజలు వాడిన విద్యుత్‌కు మళ్లీ ఇప్పుడు సర్‌ఛార్జీ రూపంలో వసూలు చేయడం దుర్మార్గం. మేలో మాకు రూ.4,800 బిల్లు వచ్చింది. జూన్‌లో రూ.7,500 వచ్చింది. ఇలా అయితే ఎలా బతికేది.

అదనపు భారాలను రద్దు చేయాలి.. ★★★

కె.సత్యనారాయణ రెడ్డి, కిరాణా షాప్, జువ్వలపాలెం

గత నెల రూ.1,245, ఈనెల రూ.1,778 కరెంటు బిల్లు వచ్చింది. విద్యుత్ బిల్లుల చెల్లింపు భారంగా మారింది. ప్రజలపై భారాలు వేయడం సరికాదు. ఈ సర్దుబాటు పేరుతో వేస్తున్న విద్యుత్తు అదనపు భారాలను వెంటనే రద్దు చేయాలి.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి.. ★★★

బి.శ్రీనివాసరావు, టైలరింగ్, జువ్వలపాలెం

విద్యుత్ బిల్లులు, షాప్ అద్దెలతో టైలరింగ్ జీవనం కష్టంగా మారింది. మే నెల రూ.280, జూన్ నెల రూ.360 రూపాయలు వచ్చింది. ఒక్కసారిగా మూడు ఇంధన సర్దుబాటు ఛార్జీలు బిల్లుల్లో కలపడంతో విద్యుత్ బిల్లులు పెరిగాయి. పెరిగిన విద్యుత్ బిల్లులను తగ్గించాలి.

విద్యుత్ భారాలు సమంజసం కాదు.. ★★★

సందగ వెంకటేశ్వరరావు, జువ్వలపాలెం

మే నెలలో కరెంట్ బిల్లు రూ.950 వచ్చింది. జూన్ నెలలో రూ.2,100 వచ్చింది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్తు ఛార్జీలు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే ప్రజల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. వ్యవసాయ రంగం, చిల్లర వ్యాపార రంగాలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడ్డాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలపై భారాలు మోపడం సమంజసం కాదు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి.

కరెంటు వాడకపోయినా ఇంత బిల్లా.. ★★★

బొప్పన హేమలత, విశ్రాంతి ఉపాధ్యాయిని, ఆచంట

గత నెల మేలో బెంగుళూరు మా అమ్మాయి ఇంటికి వెళ్లి నెలంతా అక్కడే ఉన్నాను. తిరిగి జూన్ మొదటి వారంలో ఆచంట వచ్చాను. ఏప్రిల్ నెలకు సంబంధించి రూ.787 కరెంట్ బిల్లు వచ్చింది. మే నెలలో రూ.1,236 కరెంట్ బిల్లు వచ్చింది. అసలు మేలో లేకపోయినా నాకు రూ.1,236 కరెంట్ బిల్లు వచ్చింది. ఆ బిల్లును తీసుకొని కరెంటు కార్యాలయంలోకి వెళ్లాను. అక్కడ సమాధానం చెప్పేవారే లేరు. విద్యుత్ ఛార్జీల పెరుగుదల, అదనపు ఛార్జీల వడ్డనతో నాకు ఇంత పెద్ద మొత్తంలో కరెంట్ బిల్లు రావడం ఆశ్చర్యమేసింది. విద్యుత్ బిల్లుల పేరిట భారాలు మోపడం అన్యాయం.

భారాలు భరించలేకున్నా.. ★★★

ఆచంట పెద్దిరాజు, మొబైల్ ఇస్త్రీ కార్మికుడు, ఆచంట

నేను ఆచంటలో అద్దె ఇంట్లో కుటుంబంతో ఉంటున్నాం. మా అమ్మాయి బాలింతరాలని అప్పుచేసి చిన్న ఎసి కొనుక్కున్నాను. నేను మొబైల్ ఇస్త్రీ పని చేస్తుంటాను. మార్చి నెలలో రూ.530, ఏప్రిల్‌లో రూ.816, మేలో రూ.1,602 కరెంట్ బిల్లు వచ్చింది. దీనికితోడు కరెంటు కూడా సరిగ్గా ఉండడం లేదు. నిత్యం లోఓల్టేజీ సమస్యతో ఎసి సరిగ్గా పనిచేయడం లేదు. ఎసి ఉన్నా లేకపోయినా ఒకటే అనిపించింది. అయితే అదనపు ఛార్జీల వడ్డనతో ఇంత పెద్ద మొత్తంలో బిల్లు వచ్చింది. భారాలు భరించలేకున్నాం..

సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి.. ★★★

దేవిరెడ్డి అయ్యప్ప, టైలర్, పెనుమంచిలి

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల వసూలు రద్దు చేయాలి. నాకు మే నెలలో రూ.1,200 కరెంట్ బిల్లు వచ్చింది. విద్యుత్ బిల్లు చూసి షాక్ అయ్యాను. నాకు ఇంత పెద్ద మొత్తంలో కరెంట్ బిల్లు ఎప్పుడూ రాలేదు. లోఓల్టేజీ సమస్య ఎక్కువగా ఉంది. దీంతో సరిగ్గా ఫ్యాన్లు తిరగక, లైట్లు వెలగక అనేక ఇబ్బందులు పడ్డాం. కరెంటు సరిగ్గా వాడకపోయినా ఇంత వచ్చింది. ఇలా అయితే ఏం తింటాం.. ఎలా బతుకుతాం.ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం సరైన పద్ధతి కాదు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఏమైపోతారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..!

నిర్వాసితులకు ధైర్యం చెబుతూ సాగిన 'పోలవరం పోరుకేక'

వంకావారిగూడెంలో విద్యార్థులతో శ్రీనివాసరావు మాటామంతీ

గోడు వింటూ.. సమస్యలు పరిశీలిస్తూ సాగిన మహా పాదయాత్ర

గ్రామగ్రామాన మహిళలు, చిన్నారులు ఎదురెళ్లి ఘనస్వాగతం

ప్రజాశక్తి - టి.నరసాపురం, జీలుగుమిల్లి

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోరుతూ సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్ర జిల్లాలో మూడోరోజు బుధవారం అత్యంత ఉత్తేజభరితంగా సాగింది. నిర్వాసితుల సమస్యలు వింటూ.. వాటిని పరిశీలిస్తూ నేతలు నిర్వాసితులకు ధైర్యం చెబుతూ సాగుతున్న యాత్రలో 'మేమున్నాం.. అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం.. పోరుబాట పడితే సమస్యలవే పరిష్కారమవుతాయి' అంటూ దిశా నిర్దేశం చేస్తూ నేతల ప్రసంగాలు పోరాట స్ఫూర్తిని నింపుతున్నాయి. పాదయాత్రకు మహిళలు, చిన్నారులు ఎదురెళ్లి అడుగడుగునా పూలదండలు వేసి, తిలకం దిద్ది హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు.

జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలోని మామిడిగొందిలో మూడోరోజు బుధవారం ప్రారంభమై పాదయాత్ర బర్రింకలపాడు, వంకావారిగూడెం, మడకంవారిగూడెం, చీమలవారిగూడెం, పునరావాస కాలనీల మీదుగా కొరుటూరు కాలనీలు చేరుకుని రాత్రి బస చేసింది. పోరెడ్డిగూడెం, కట్కూరు పునరావాస గ్రామాల నిర్వాసితులు పాదయాత్ర బృందానికి తమ సమస్యలు చెప్పుకున్నారు. ఇప్పటికీ పరిహారం అందలేదని, కాలనీల్లో తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనిపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సిపిఎం చేపట్టే పోరాటాల్లో నిర్వాసితులంతా కలిసి రావాలని, సమస్య పరిష్కారమయ్యే వరకూ ఎర్రజెండా విశ్రమించదని చెప్పారు. సమస్యలను కెఆర్‌పురం ఐటిడిఎ పిఒకు ఫోన్ చేసి వివరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. యాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమసింగ్ పాల్గొని సమస్యలు పరిశీలించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఎండగడుతూ నిర్వాసితులు చేపట్టాల్సిన పోరు గురించి దిశానిర్దేశం చేశారు. బర్రింకలపాడు రింగు రోడ్డు వద్ద ప్రజాశక్తి బృందం పాదయాత్రకు సంఘీభావం తెలిపింది. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు బుధవారం మధ్యాహ్నం వరకూ పాదయాత్రలో పాల్గొన్నారు. వంకావారిగూడెంలో ఫౌండేషన్ పాఠశాలలో గిరిజన విద్యార్థులతో శ్రీనివాసరావు కొద్దిసేపు ముచ్చటించారు. ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, వ్యకాస, సిఐటియు రాష్ట్ర నేతలతోపాటు పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, ఎన్‌టిఆర్ జిల్లాల నేతలు ఈ యాత్రలో పాల్గొని నిర్వాసితుల సమస్యలపై నినదించారు. కళాకారుల కళారూపాల ప్రదర్శన, ఆలపించిన గీతాలు ఆకట్టుకోవడంతోపాటు ఆలోచింపజేశాయి. ఈ యాత్రలో భాగంగా ఆయా గ్రామాలు, కాలనీల్లో జరిగిన సభల్లో విక్రమసింగ్, శ్రీనివాసరావుతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, బి.తులసీదాస్, కె.సుబ్బరావమ్మ, వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వై.అచ్యుతరావు, జయరాం, కె.హరికిషోర్, బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా నేతలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలు, పునరావాస కాలనీల మీదుగా సాగిన పాదయాత్ర

విద్యార్థి దశ కీలకం : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యార్థి దశ కీలకమని, విద్యార్థులు లక్ష్యం ఏర్పాటు చేసుకొని వాటిని సాధించడానికి కృషి చేయాలని నరసాపురం సబ్ కలెక్టర్ సూర్య తేజ కోరారు. స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల 56వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వార్షికోత్సవానికి కళాశాల ప్రిన్సిపల్ టి.రాజారాజేశ్వరి అధ్యక్షత వహించి కళాశాల వార్షిక నివేదికను వివరించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను ఏవిధంగా అధిరోహించాలి, లక్ష్యాలను ఏ విధంగా ప్రణాళిక బద్ధంగా నెరవేర్చుకోవాలో వివరించారు. అనంతరం టాపర్లకు అవార్డులు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్.పెద్దిరాజు, తహశీల్దార్ పెద్దిరాజు, ఎన్వి. రంగారావు, అద్దేపల్లి మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యత : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు విద్య వైద్యం అందించేందుకు అధిక ప్రాధాన్యతిస్తోందని ప్రజా పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. పాలకొల్లులో రూ.62 లక్షలతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ అతిథి గృహాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం రామారావు పేటలో రూ.కోటి 10 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి ప్రసంగించారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. ఎంఎల్సి కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ పాలకొల్లులో ప్రభుత్వాసుపత్రి శరవేగంగా నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మేకా శేషుబాబు, వైసిపి నేతలు గుణ్ణం నాగబాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్ పాల్గొన్నారు.

పండిత విల్లూరులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి - పోడూరు

ఎన్నో ఏళ్లుగా లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న పండిత విల్లూరు గ్రామ శివారు కట్టమ్మ తాడితోపు వాసుల కల నేటికి నెరవేరింది. రూ.6 లక్షల వ్యయంతో ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు సహకారంతో బుధవారం ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇటీవల సమస్యను ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు దగ్గర కాలనీ వాసులు మొరపెట్టుకున్నారు. ఆయన స్పందించి విద్యుత్ ఎఇ శ్రీనివాస్‌కు ట్రాన్స్ ఫార్మర్ వేయాలని ఆదేశించారు. దీంతో కాలనీవాసులు ఎంఎల్ఎకు ఎఇ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

కుమ్మర్లవీధిలో సీసీ రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

కుమ్మర వీధి నుంచి త్వరలోనే సీసీ రోడ్డు నిర్మించాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం సత్యవరంలో కుమ్మర వీధిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రంగనాథరాజు స్థానికులతో మాట్లాడారు. ఆ వీధిలో ఉన్న చెట్లను తొలగించి మూడు మీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టడానికి పనులు ప్రారంభించాలని పంచాయతీరాజ్ ఎఇ శివ ఎంఎల్ఎ ఆదేశించారు. రహదారి నుంచి పుంతకు బలంగా తూరలు ఏర్పాటుచేసి, రోడ్డు నిర్మించాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ చుక్కా అప్పారావు, తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, ఎంపిటిసి గెద్దం ఈశ్వరుడు, పంచాయతీ కార్యదర్శి పి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

గర్భిణులు, పిల్లల వివరాలు ఎప్పటికప్పుడు యాప్ ద్వారా నమోదు చేయాలని ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సూటబుల్ డెవలప్‌మెంట్ గోల్ (ఎస్‌డిజి)పై పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఎఎన్ఎంలకు వారంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణబాబ్జి మాట్లాడుతూ తమ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా మహిళలకు కావాల్సిన రక్షణ, సంరక్షణ కోసం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిడిపిఒ మేరీ ఎలిజిబెత్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

ఉండి: ఉండి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామరాజు తెలిపారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం క్లబ్ సమావేశం గొట్టుముక్కల రాము అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గం జులై 1వ తేదీ నుంచి పదవీ బాధ్యతలు చేపడుతుందని తెలిపారు. క్లబ్ అధ్యక్షులుగా వేగేశ్న అనంతలక్ష్మి, కార్యదర్శిగా కన్నెగంటి రూత్‌కళ, కోశాధికారిగా సాగిరాజు సూర్యకుమారి, ఉపాధ్యక్షులుగా సత్తి బ్రహ్మారెడ్డి, గాదిరాజు రంగరాజు, ఎల్‌సిఐఫ్ కోఆర్డినేటర్‌గా సాగిరాజు సాంబరాజు, సర్వీస్ ఛైర్ పర్సన్ ద్వారంపూడి నారాయణరెడ్డి, మెంబర్‌షిప్ ఛైర్మన్ కూనపరాజు రామరాజు, పరిపాలన ఛైర్మన్ రుద్రరాజు నరసరాజు, మార్కెటింగ్ ఛైర్మన్ ముదునూరి శివరామరాజు ఎన్నికయ్యారని చెప్పారు. తమ పాలనా కాలంలో అన్ని విధాలా సహకరించిన సభ్యులకు గొట్టుముక్కల రాము, సీతారామరాజు ధన్యవాదాలు తెలిపారు.

కుష్టుపై అవగాహనా సదస్సులు

గణపవరం: కుష్టు వ్యాధిపై మండలంలోని అన్ని సచివాలయాల వద్ద అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోషనాయుడు తెలిపారు. బుధవారం అర్ధవరం గ్రామంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రి పరిధిలో అన్ని గ్రామాల్లో జులై 27వ తేదీ వరకూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. తమ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి స్థానికులకు పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా శరీరంపై రాగి రంగు మచ్చలు, వీపుపై నొప్పిలేని బుడగులు, వెంట్రుకలు రాలిపోవటం తదితర లక్షణాలు ఉంటే ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, ఎంఎల్‌హెచ్‌పి ఎస్.దివ్యభారతి, హెల్త్ అసిస్టెంట్లు జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

1 నుంచి జగనన్న సురక్ష

పెనుమంట్ర: జులై 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష షెడ్యూల్ బుధవారం ఎంపిడిఒ వి.పూర్ణ బాబ్జి విడుదల చేశారు. ఒకటో తేదీ ఆలమూరు సచివాలయంలో టీమ్-1 బృందంగా తహశీల్దార్ దండు అశోక్ వర్మ, ఎఇపిఆర్ ఎస్.నాగిరెడ్డి, ఆర్ఐ అప్పారావు, భట్లమగుటూరులో టీమ్-2 బృందంగా ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, డిప్యూటీ తహశీల్దార్ కె.ఏలియమ్మ, జూనియర్ అసిస్టెంట్ సిహెచ్.ఉదయ్‌కిరణ్ ఉంటారని తెలిపారు. అలాగే నాలుగో తేదీన ఓడూరులో టీమ్-1, నెలమూరులో టీమ్-2. 6న నెగ్గిపూడిలో టీమ్-1, వెలగలేరులో టీమ్-2, 11న మార్టేరు-1లో, 13న సత్యవరంలో, వెలగలవారిపాలెంలో, 15న పొలమూరు-1లో, పొలమూరు-2లో, 18న నత్తా రామేశ్వరంలో, మాముదూరులో, 20న పెనుమంట్ర-1లో, పెనుమంట్ర-2లో, 25న మల్లిపూడిలో, జుత్తిగలో, 27న సోమరాజు ఇల్లింద్రపర్రులో పాల్గొంటారని తెలిపారు. ప్రతి సచివాలయంలో ఉదయం 9:30 ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

కాళ్ల: సామాజిక స్పృహతోపాటు విద్యను ప్రోత్సహించడం తన బాధ్యత అని, విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని జయభేరి ఛారిటబుల్ సొసైటీ ఛైర్మన్ కొనిశెట్టి సురేష్ అన్నారు. కాళ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో చదువుతున్న 75 విద్యార్థులకు జయభేరి ఛారిటబుల్ సొసైటీ తరుపున సుమారు రూ.45 వేల విలువైన విద్యా సామగ్రిని బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏటా పుస్తకాలు, ఇతర సామగ్రి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బందా విజయప్రసంగి, జి.ప్రభాకర్, గనిశెట్టి షణ్ముకేశ్వరరావు, గంటా బాలు, చిత్తజల్లు గిరిబాబు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ శామ్యూల్ బుధవారం ఉదయం కడకట్లలోని 31, 32 వార్డుల్లో పర్యటించారు. శానిటరీ సిబ్బందిని వెంట బెట్టుకుని ఆయన డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుపర్చాలని ఆదేశించారు. దేవాదాయ ధర్మదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చి, దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మార్టేరులో మినీఫిష్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు బస్‌స్టాండ్ వద్ద మినీ ఫిష్ మార్కెట్‌ను ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ పిఎంఎంఎస్‌వై పథకం ద్వారా రాయితీపై లోను ఇస్తారని, రైతులు అర్హులని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలకు మంచి నాణ్యమైన పరిశుభ్రమైన చేపలను, రొయ్యలను అమ్మటం తదితర ఉపయోగాలున్నాయన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పన, సుస్థిర అభివృద్ధి జరుగుతుందన్నారు. రూ.1,59,172తో 60 శాతం రాయితీతో ఆలమూరుకు చెందిన వసంతడ నాగేశ్వరరావు లబ్ధి పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మట్టా కుమారి, జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, ఎంపిటిసి కర్రి అనురాధ, వీరవాసరం మత్స్య శాఖ అభివృద్ధి అధికారి జి.శ్రీనివాసరావు, ఆలమూరు విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ ఎస్.గౌరీప్రియ పాల్గొన్నారు.

పోరుకేక పాదయాత్రకు నిధి సేకరణ

ప్రజాశక్తి - పాలకోడేరు

పోలవరం నిర్మాణం పూర్తి చేయాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన పోలవరం పోరు కేక పాదయాత్రకు సంఘీభావంగా సిపిఎం మండల కమిటీ బుధవారం నిధి సేకరణకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా విస్సాకోడేరు, గొరగనమూడి, శృంగవృక్షం గ్రామాల్లో నాయకులు నిధి సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ్య, నాయకులు కలిదిండి గోపాల్‌రాజు, కోటికలపూడి శ్రీనివాసరావు, కె.వెంకన్న, కలిదిండి బంగారు రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

విద్యార్థినులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ వెలగల అరుణ అన్నారు. బుధవారం ఎస్‌కెఎస్‌డి మహిళా డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో ఫేర్‌వెల్ డే ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడతూ విద్యార్థినులు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. నీతి నిజాయతీలను అలవర్చుకుని సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదగాలన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి మాట్లాడుతూ విద్యార్థినులు కేవలం ఉన్నత విద్యను పొందడమే కాకుండా తమను తాము రక్షించుకునే విధంగా ఆత్మవిశ్వాసం, ధైర్యం కలిగి ఉండాలని తెలిపారు. ఎస్‌కెఎస్‌డి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి, ట్రెజరర్ నందిగం సుధాకర్ మాట్లాడారు. విద్యార్థినులు ఒత్తిడికి గురికాకుండా జీవితాలను తీర్చి దిద్దుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ అరుణను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుందరీబాయి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేంపాడు పాఠశాలలోతనిఖీ చేస్తున్న ఎంఇఒ కనకరాజు

పాఠశాలల్లో ఎంఇఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు ఆకస్మిక తనిఖీలు బుధవారం చేపట్టారు. కోపల్లె మెయిన్, కోపల్లె స్పెషల్, వేంపాడు ఎల్ఇ, పెద అమిరం, ఉప్పరగూడెం ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను, పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని తీరును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థుల బాగోగులు, చదువు, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని వి.సుధారాణి, జి.జోజికుమారి, పి.సుధారాణి, ప్రధానోపాధ్యాయులు వేటుకూరి రవికుమార్ రాజు, ఉపాధ్యాయులు కొత్తపల్లి అశోక్, సిఆర్‌పి పుష్పరాజ్ పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలకు ప్రత్యేక సర్వీసులు

తాడేపల్లిగూడెం: తొలిఏకాదశి సందర్భంగా గురువారం తాడేపల్లిగూడెం బస్‌స్టాండ్ నుంచి ద్వారకాతిరుమల చిన వెంకన్న దర్శనార్థం ఉదయం 5.00 గంటల నుండి ప్రతి 30 నిమిషాలకూ బస్ సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ యేలూరు సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డంపింగ్ యార్డుకు రెండెకరాల స్థలం

మొగల్తూరు: మొగల్తూరులోని రామలబందగరువులో కేటాయించిన రెండెకరాల స్థలాన్ని బుధవారం పంచాయతీకి డంపింగ్ యార్డు కోసం రెవెన్యూ అధికారులు అప్పగించారు. డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడంతో పాలకవర్గం భూమిని కేటాయించాలని రెవెన్యూ అధికారులను గతంలో కోరారు. దీనిపై రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతంలో రైతుల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే నిర్వహించి రెండు ఎకరాలకు హద్దులు నిర్ణయించారు. అప్పటినుండి పంచాయతీకి స్వాధీనం చేయలేదు. కొంతకాలంగా పాలకవర్గ సభ్యులు సమస్యను కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తహశీల్దార్ అనితకుమారి పంచాయతీకి అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆర్ఐ శిరీషకు స్వాధీనం చేశారుజ పంచాయతీ సభ్యులు అక్కడ భూమిని స్వాధీనం చేసుకుని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఉపసర్పంచి బోణం నరసింహారావు, కార్యదర్శి జయరాజు విఆర్ఒ వెంకటలక్ష్మి పలువురు రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాలక వర్గ సభ్యులు ఉన్నారు.

ఉండిలో వైసిపి జెండా ఎగరేస్తాం : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

టిడిపి కంచుకోటలో వైసిపి జెండా ఎగరేస్తామని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉండి నియోజకవర్గంలో 150వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఉండి మూడో సచివాలయం పరిధిలో కార్యకర్తలు, నాయకులు బాణాసంచా కాల్చి కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జానపద సృజనాత్మక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి నాయకులు కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి పివిఎల్ నరసింహరాజును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం పివిఎల్ నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాస్‌రాజు మాట్లాడుతూ టిడిపి కంచుకోట అయిన ఉండి నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగురవేసేలా చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల నిరసన

మొగల్తూరు: తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 10, 11వ తేదీల్లో కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో అంగన్‌వాడీలు పాల్గొనాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, మేడిది స్వర్ణలత, కె.సారమ్మ, డి.మంగ పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న 1200 కోట్ల రూపాయలను బోర్డుకు జమ చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలని ఎపి భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన చర్యలేమీ లేవన్నారు. కనీసం వారి సంక్షేమ బోర్డులో ఉన్న నిధులనైనా వారికి ఉపయోగపడేటట్లు చేయాలని కోరారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఎక్కువ మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, రెక్కల కష్టం తప్ప వేరే ఆధారం లేదని తెలిపారు. వారికి ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, రుణాలు వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి ఉందన్నారు. భవననిర్మాణ కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు, వీరవల్లి మాధవ్, పసుపులేటి సత్యనారాయణ, పొట్టిపోతు మధుసూదనరావు, బొంతు రామస్వామి పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నేతలు

విద్యార్థులకు టీ షర్టులు అందజేత

పాలకొల్లు : పట్టణంలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాల విద్యార్థులు 60 మందికి వైసిపి యలమంచిలి మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు రూ.20 వేల విలువైన టీ షర్టులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైసిపి పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని, అలాగే దాతలు కల్పిస్తున్న సదుపాయాలు వినియోగించుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ తోకల జనార్ధన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరిస్తాం : జెడ్‌పిటిసి

పోడూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జెడ్‌పిటిసి ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖలకూ సంబంధించిన అధికారులు పాల్గొని తమ శాఖలకు సంబంధించిన పనుల వివరాలను వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ బుజ్జేశ్వరరావు మాట్లాడుతుండగా పెనుమదం గ్రామ సర్పంచి తానేటి బాబూరావు, ఎంపిటిసి మానేపల్లి శ్రీధర్ పెనుమదంలో సుమారు 18 మంచినీటి వాటర్ ట్యాంకులు ఉండగా ఒక్క వాటర్ ట్యాంక్ నుంచి కూడా చుక్క నీరు తాగడానికి ఉపయోగపడకుండా ఉందని తెలిపారు. మీ గ్రామంలో పెత్తనం ఎవరు చేస్తున్నారో చెప్పాలని ఆ అధికారి అనడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. జెడ్పి ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ మండలంలో ఎటువంటి సమస్యలున్నా ఆయా గ్రామాల సర్పంచులను, కార్యదర్శులను కలుపుకొని సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు ఇందుకూరి సీతారామరాజు, (చినబాబు) గుబ్బల సత్యనారాయణ, సర్పంచులు, రామన వీర్రాజు, పద్మనాభ రాజు, ఇళ్ల లక్ష్మీ చంద్రిక పాల్గొన్నారు.

మంత్రి కొట్టుపై బొలిశెట్టి ఆగ్రహం

తాడేపల్లిగూడెం: వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లయినా మంత్రి కొట్టు సత్యనారాయణ తీరు మారలేదని, మంగళవారం ఆయన మాట్లాడిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం జనసేన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల క్రితం తేతలి గ్రామంలో స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో స్థానిక పాతూరుకు చెందిన వ్యక్తి హత్య కావడం, ఆ ఇరువురు జన సైనికులు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలిసీ తెలియని వ్యాఖ్యలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరీ కమిటీ సభ్యులుగా బాలకృష్ణ

పాలకోడేరు: గొరగనమూడి గ్రామానికి చెందిన పొన్నమండ బాలకృష్ణ జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరీ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. భీమవరం కలెక్టరేట్లో సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి బుధవారం నియామకపత్రాన్ని బాలకృష్ణకు అందజేశారు. బాలకృష్ణ ప్రస్తుతం వైసిపి ముఖ్య నేతగా, స్వామి జ్ఞాననంద జల పరిషత్తు ఉన్నత పాఠశాలకు తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్‌గా, రాష్ట్ర దళితనేతగా ఉన్నారు. ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియామకం కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసి బాలకృష్ణను అభినందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టిలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు.

నియామకపత్రాన్ని అందజేస్తున్న శోభారాణి

నాగరాజు దంపతులకు పవన్‌కళ్యాణ్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఉండి

జనసేన ఉండి నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు దంపతులకు బుధవారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ నాగరాజు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉండి నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలపై ఆరా తీశారు. జనసేన విజయానికి కృషి చేయాలని, ఉండి నియోజకవర్గంలో పార్టీని పటిష్ట పర్చాలని నాగరాజుకు సూచించినట్లు తెలిపారు.

వైసిపి నేత సింహాచలంకు పివిఎల్ పరామర్శ

ఉండి: వైసిపి జిల్లా కార్యదర్శి, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ మాజీ సర్పంచి మునుకోలు సింహాచలాన్ని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు బుధవారం పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహ రాజు మాట్లాడుతూ సింహాచలం క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అన్నారు. ఆయన వెంట ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, నాయకులు గులిపల్లి అచ్చారావు, ఏడిద వెంకటేశ్వరరావు, కరిమెరక శివ నాగరాజు ఉన్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న లారీ

ముగ్గురు యువకులకు గాయాలు - ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - పాలకోడేరు

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గరగపర్రు వైపు నుంచి భీమవరం వైపు వెళ్తున్న లారీ అదే సమయంలో పాలకోడేరు వైపు నుంచి గొల్లలకోడేరు మీదుగా ఉప్పరగూడెం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులను బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో కొంత దూరం క్యాబిన్ కింద ఇరుక్కుపోయిన ముగ్గురు యువకులను లారీ కొంత దూరం ఈడ్చుకెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఉప్పరగూడెం ప్రాంతానికి చెందిన చింతపల్లి శ్రీను, కాలా శ్రీను, చింతపల్లి మాణిక్యాలరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో భీమవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ముగ్గురిలో చింతపల్లి శ్రీను పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం. పాలకోడేరు పోలీసులను వివరణ కోరగా ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందని, ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక ప్రకారం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 146-155/GGMP-Grant & General/2023-24, Dated. 28-6-2023

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Construction of Toilets, Providing new bore well, Electrification of Sachivalayam Building, Providing of Firefighting Accessories, Supply, Delivery, Commissioning and Testing of PTZ CC Cameras, Providing Wet Mix Road, Providing CC Culverts, Supply of Tractor Engines to Vehicle Depo in Municipal Corporation, Eluru"** Total No of works is **10** with an amount of Rs. **68.48** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 01-07-2023. Last date of receipt of tenders is 05-07-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone / Fax: 08812 - 245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, పెనుమంట్ర గ్రామం కాపురస్థుడైన పాకేర్ల పవన్‌కుమార్, తండ్రి: భాస్కరరావు అను నాకు **L7228552** నెంబరు గల పాస్‌పోర్టు గత నెల ది. 15-05-2023వ తేదీన మోటారు సైకిల్‌పై పెనుమంట్ర గ్రామం నుండి మార్టేరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో ఎక్కడో పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

పాకేర్ల పవన్‌కుమార్
తండ్రి: భాస్కరరావు
డోర్ నెంబర్: 3-59
పెనుమంట్ర గ్రామం, పెనుమంట్ర మండలం
పశ్చిమగోదావరి జిల్లా, పిన్‌కోడ్: 534124
సెల్: 8838446970

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 354/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Thonta Suryanarayana another ***...Defendant***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) తొంట సూర్యనారాయణ, తండ్రి: వెంకట క్రిష్ణ మూర్తి, హిందువు, పురుషుడు, కంతేరు, H/o. అడవిపాలెం, యలమంచిలి మండలం.
2) వేముల జయరాజు, తండ్రి: యర్రియ్య, హిందువు, పురుషుడు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.03-07-2023వ తేదీన** ఉదయం **గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku.

కోర్టు నోటీసు

మహారాజశ్రీ పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు VIIth Additional District Judge (Family) కోర్టులో
Hindu Marriage O.P. No. 102/2022

Between:
Gude Ramana, S/o. Venkateswarlu, D.No. 4-37A, Pulikonda (Post), చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా-523226. **-పిటీషనరు**
AND
Smt. Gude Aishwarya, W/o. Ramana, D/o. Ashim Chakravarthi, D.No. 2/149, Backside of Panchayat Office, Water Tank Road, సత్రంపాడు, ఏలూరు, ప॥గో॥జిల్లా.

పిటీషనరు అయిన Gude Ramana మీ పయ్ని H.M.O.P. No. 102/2022 Under Section 13(1) (19) on the Grant of Cruelty పయ్ని మీకు పిటీషనరుకు జరిగిన ది. 09-3-2019వ తేదీన జరిగిన వివాహాన్ని రద్దుపరచి మీపయ్ని Divorce యిప్పించవలసినదిగా పై కోర్టులో H.M.O.P. No. 102/2022 దాఖలు చేయగా అందు పయ్ని మీకు పై అడ్రసుకు చాలా పర్యాయములు కోర్టు ద్వారా, పోస్టల్ ద్వారా నోటీసులు తీసుకోవలసిందిగా కోర్టు నోటీసులు పంపించినా మీరు తీసుకోనందున, మీకు అమలు జరగనందున పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు జిల్లా ప్రకటన ద్వారా ఈ నోటీసు పంపించడమైనది.

కావున మీరు **ది. 05-7-2023వ తేదీన** వకీలు ద్వారా గాని, స్వయంగా గాని హాజరై మీ అభ్యంతరములు, మీ వాదనలు దాఖలు చేసుకోవలసినదిగా యిందుమూలముగా మీకు తెలియజేయడమైనది. అట్లు మీరు జరిగించని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

(పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

GUN LAW ASSOCIATES
GADILLI UGRANARASIMHA RAO
GADILLI L.N.S.SURYA TEJA
ఏలూరు — Advocates, Eluru
ది.19-5-2023 — Cell: 9966914954

ప్రకటన

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 205/2022

వాది: గుండుబోయిన వెంకట ధనలక్ష్మి
అండ్

ప్రతివాద్లు:
1) పెనుమత్స రుక్మిణీ దేవి, భర్త: లేటు వెంకట సత్యసన్యాసి బాబా రవికుమార్ వర్మ, 43 సం॥లు, హిందు, గృహిణి, డో.నెం. 2-115, ఓడూరు గ్రామం, పెనుమంట్ర మండలం, తణుకు జె.సి.జె.
2) పెనుమత్స వెంకట రామరాజన్ వర్మ, తండ్రి: లేటు వెంకట సత్యసన్యాసి బాబా రవికుమార్ వర్మ, 36 సం॥లు, హిందు, ప్రైవేటు ఉద్యోగము, డో.నెం. 2-115, ఓడూరు గ్రామం, పెనుమంట్ర మండలం, తణుకు జె.సి.జె.
3) కలిదిండి శ్రీసూర్య సావిత్రి సుబద్రాదేవి, భర్త: రామసత్య సునీల్, తండ్రి: లేటు వెంకట సత్యసన్యాసి బాబా రవికుమార్ వర్మ, డో.నెం. 2-115, ఓడూరు గ్రామం, పెనుమంట్ర మండలం, తణుకు జె.సి.జె.

మీలో 1వ వారు లేటు పెన్మెత్స వెంకట సత్య సన్యాసిబాబా రవికుమార్ వర్మ గార్కి భార్య గారునూ 2వ వారు కుమారుడు, 3వ వారు కుమార్తె అయి ఉన్నారు. లేటు వెంకట సత్య సన్యాసిబాబాగారు వారి జీవిత కాలములో ది.29-03-2019 సం॥రం తేదీన వాది వద్ద ప్రాంశరీ నోటుపై తీసుకున్న రూ.3,50,000/- బాకీ తీర్చకుండా చనిపోయినందున ఆయనకు వారసులు అయిన మీపై దావా ప్రోనోటు బాకీ రికవరీ నిమిత్తం దాఖలు చేసిన పై నెంబరు దావా నందు మరియూ దావా బాకీనకు హామీగా 1వ వారి భర్త 2,3 వార్ల తండ్రి గారి ద్వారా సంక్రమించిన ఆస్థిని తోడజప్తు చేయించమని కోరుచూ దాఖలు చేసిన ఐ.ఎ.నెం. 376/22 పిటీషనునందు రెస్పాండెంట్లు /ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారానూ, పోస్టు ద్వారాను ఎన్నిసార్లు సమన్లు, నోటీసులు పంపిననూ అమలు జరగని కారణంగా Substitute Of Service ద్వారా అమలు జరుగు నిమిత్తం **ది.03-07-2023 సం॥రం తేదీనకు వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By Order//

శ్రీ వి.ఎన్.శ్రీనివాసరెడ్డి
డి. హెచ్. ఆర్. తరుపు న్యాయవాది,
తణుకు. సెల్: 94410 35648

డి.కృష్ణకుమారి
తణుకు, — అడ్వకేట్, తణుకు.
28-6-23. — సెల్: 83093 92488